జోరుగా దాళ్వా సాగు పనులు

- పూర్తయిన సార్వా మాసూళ్లు
- కూలీల కొరతతో తీవ్ర ఇబ్బందులు
- పొలాల ఒబ్బిడిలో రైతులు నిమగ్నం


యనమదుర్రులో పొలంలో దమ్ము చేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: ఒక పక్క సార్వా మాసూళ్లు, మరో వైపు దాళ్వా సాగుకు సంబంధించి దుక్కులు, గట్టు లంకలు, నారుమళ్ల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అన్ని పనులు ఒకేసారి రావడంతో కూలీలు లభించక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భీమవరం మండలంలో అనాకోడేరు, రాయలం, దిరుసుమర్రు, యనమదుర్రు, కొమరాడ, కొవ్వాడ అన్నవరం, చినఅమిరం, తాడేరు, బేతపూడి, తుందుర్రు, గొల్లవానితిప్ప గ్రామాల్లో సుమారు 7వేల ఎకరాల్లో సార్వా సాగు చేయగా తుపాను ప్రభావంతో మాసూళ్ల ఆలస్యమయ్యాయి. రైతులు తన ధాన్యాన్ని మార్కెట్‌కు తరలించే పనుల్లో నిమగ్నమయ్యారు. దాళ్వా సాగు సుమారు 9 వేల ఎకరాల్లో దాళ్వా సాగుకు శ్రీకారం చుట్టి రైతులు పొలాల్లో దుక్కులు, దమ్ములు చేపట్టారు. దాళ్వా వరి నాట్లు డిసెంబర్ నెలాఖరుకు పూర్తవ్వాల్సి ఉండగా నత్తనడకన సాగుతుండటంతో మార్చి, ఏప్రిల్‌లో వచ్చే నీటి ఎద్దటి ప్రభావం పంటపై పడటమే కాకుండా మూడో పంటగా సాగు చేసే అపరాల పంటపై తీవ్ర ప్రభావం పడనుందని పలువురు రైతులు చెబుతున్నారు.

కూలీలు లభించక రైతుల అవస్థ

సార్వా మాసూళ్లు, దాళ్వా పంట పనులు ఒకేసారి రావడంతో కూలీలు రావడం దొరకడం లేదని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా మరో వారంలో సంక్రాంతి పండుగ ఉన్న నేపథ్యంలో కూలీలకు రోజు కూలీతో పాటు అదనంగా రూ.150 నుంచి రూ.500 వరకు ఇచ్చి పనులు చేయించుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. దీంతో సాగు మరింత ఆలస్యమవుతుందని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే నాట్లు వేసేందుకు బెంగాల్ కూలీలు జిల్లాకు వచ్చారు. వారితో నాట్లు వేయిస్తే సమయంతోపాటు, పెట్టుబడి ఆదా అవుతుందని రైతులు భావిస్తున్నారు.

వెదజల్లే పద్ధతితో ఎంతో ఆదా



తుపాను ప్రభావంతో లోతట్టు ప్రాంతంలో సార్వా సాగు ధాన్యం ఒబ్బిడి అవుతుంది. దాళ్వా వరినాట్లు ఆలస్యమైతే మార్చి, ఏప్రిల్‌లో కోత దశలో నీటి ఎద్దడి వస్తే పంట దిగుబడిపై ప్రభావం చూపుతుంది. వెదజల్లే పద్ధతి అనుసరిస్తే వారం నుంచి రెండు వారాలు సమయం ఆదా అవడమే కాకుండా ఖర్చు ఎకరానికి రూ. 3 వేలు నుంచి రూ.5 వేల వరకు ఖర్చు సాగులో తగ్గుతుంది. రైతులు వెదజల్లే పద్ధతి అనుసరిస్తే బాగుంటుంది.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

క్లుప్తంగా

ఎఫ్‌సీఐ కాలనీలో ముగ్గుల పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎఫ్‌సీఐ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంప్రదాయాలను గుర్తు చేస్తూ పోటీ పడిన మహిళలు వేసిన ముగ్గులు ఆకర్షించాయి. ఈ సందర్భంగా విజేత మహిళలకు నగదు, ఇతర బహుమతులు అందజేశారు. కాలనీ అసోసియేషన్ ఎం.రంగారావు, కార్యదర్శి ఎం.జనార్దన్, గౌరవాధ్యక్షులు పి.నాగరాజు, కోశాధికారి పరమాత్మ, శానం లలిత, లక్ష్మీ, పార్వతి, డాక్టర్ కంచర్ల సాయి పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ


అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): అయోధ్య రాముని అక్షింతలను ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక నంది బొమ్మ సెంటర్ రామాలయం నుంచి ఊరేగింపుగా భక్తులకు పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయా నాయకులు మాట్లాడుతూ జనవరి 22న అయోధ్య రామాలయం ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు అక్షింతలు తలపై వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, సుంకవల్లి రామకృష్ణ, ముప్పిడి సురేష్ రెడ్డి, కోట రాంబాబు, కర్రి ప్రభాకర్ బాలాజీ, బోగిరెడ్డి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా తిరుప్పావై పారాయణం


కె. పెంటపాడు బైరాగి మఠంలో తిరుప్పావై పారాయణం చేస్తున్న దృశ్యం

పెంటపాడు: ధనుర్మాసం పురస్కరించుకుని ప్రతీనిత్యం ఉదయం 6 గంటల నుండి జరిగే తిరుప్పావై పఠనలో పాల్గొన్న అందరికీ ఆధ్యాత్మిక ముక్తి లభిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, వెంకట్రామన్నగూడెం వైఎస్సార్ హార్టీకల్చర్ డిప్యూటీ డైరెక్టర్ మేకల చిరంజీవులు పేర్కొన్నారు. ఆదివారం తెల్లవారుజామున ఈఓ శివశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక ధనుర్మాస పూజలు నిర్వహించారు. అనంతరం ఈఈ మేకల చిరంజీవులు సుమారు గంటపాటు స్వామివారి తిరుప్పావై పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు త్రిలోచన దాసు, పూర్ణచంద్రత్రిపాఠి పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత


నీలాద్రిపురంలో క్రీడాకారులకు సామగ్రిని అందజేసిన సర్పంచ్ లక్ష్మణరావు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నీలాద్రిపురం సచివాలయం వద్ద ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు ఆదివారం క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజమహేంద్రవరపు లక్ష్మణరావు మాట్లాడుతూ సచివాలయం, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో జరిగే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో సత్తా చాటి తాడేపల్లిగూడేనికి మంచి పేరు తేవాలన్నారు. ప్రస్తుతం బిజీ జీవితంలో క్రీడలకు అవకాశం లేకుండాపోతుందన్నారు. విద్యతో పాటు క్రీడల వైపు గ్రామీణ యువతను ప్రోత్సహించేందుకు ఆడుదాం ఆంధ్ర పోటీలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో పాల్గొని సత్తా చాటాలన్నారు. కాగా, కృష్ణాపురంలో జెడ్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు క్రీడా సామగ్రిని అందజేశారు. ఉప సర్పంచ్ మేణ్ణి రామారావు, సచివాలయ కార్యదర్శి టి.పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

పాలకొల్లు సెంట్రల్: బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) నిర్వహించిన సైన్స్ అండ్ స్టాండర్డ్స్ పై మల్టీలెవెల్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని బీవీఆర్ మునిసిపల్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.ప్రభాకరశాస్త్రి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు, ఉపాధ్యాయురాలిని అభినందించారు. ఈ సందర్భంగా ఈ నెల 5న విజయవాడలో హయత్ ప్లేస్‌లో నిర్వహించిన రీజియనల్ లెవెల్ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో తమ పాఠశాల నుంచి ఎస్.హేమవల్లి, ఎ.జాహ్నవి విద్యార్థులు ఇద్దరూ కన్సోలేషన్ బహుమతులు అందుకున్నారన్నారు.

వైభవంగా అమ్మవార్ల గ్రామోత్సవం


పంజా వేమరంలో అమ్మవార్ల గ్రామోత్సవం


ఆలయ పందిరిలో భక్తులు సమర్పించిన అరటి గెలలు


ఉత్సవంలో పాల్గొన్న గ్రంధి రవితేజ, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, నాయకులు

వీరవాసరం: పంజా వేమవరంలో వేంచేసి ఉన్న పద్దల అంకమ్మ, దేవగిరి సత్తెమ్మ అమ్మవార్ల గ్రామోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. మేళ తాళాలు, బాణసంచా కాల్పుల మధ్య అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు. సాంస్కృతిక, సంప్రదాయ నృత్యం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యుత్ దీపాలంకరణ, పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. అమ్మవార్ల ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన పందిరిలో గ్రామస్తులు, గ్రామ ఆడపడుచులు బూరెలు, గారెలు అరటి పండ్ల దండలను వేలాడదీసి అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. ఇవి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం భక్తులకు వాటిని ప్రసాదంగా పంపిణీ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

పెరిగిన పింఛన్‌తో ఆర్థిక భరోసా


ఉణుదుర్రులో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉండి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెంచిన పింఛన్లతో వృద్ధులు, వితంతువులకు భరోసా లభించిందని ఉణుదుర్రు సర్పంచ్ పిన్నంరాజు నాగలక్ష్మీ, ఎంపీటీసీ అల్లూరి మాధవి అన్నారు. ఆదివారం గ్రామంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ రూ.3 వేలకు పెంచారని అన్నారు. పెంచిన పింఛన్ లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల లీగల్ సెల్ అధ్యక్షుడు జీ సుందర్‌కుమార్, గ్రామపార్టీ అధ్యక్షుడు వర్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పాస్టర్ దావీదు మృతికి సంతాపం


పాస్టర్ దావీదుకు నివాళులర్పిస్తున్న ముస్లింలు, వ్యాపారులు


పాస్టర్ గెద్దం దావీదు (ఫైల్)

ఉండి: ప్రముఖ పాస్టర్ గెద్దం దావీదు (65) అనారోగ్య కారణాలతో విజయవాడలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఆయన స్వగ్రామం మండలంలోని యండగండి. ఆయన ఎన్నో ఏళ్ల నుంచి పాస్టర్‌గా, జాన్సన్ బైబ్ ఇనిస్టిట్యూట్ (భీమవరం) ప్రిన్సిపల్‌గా సేవలందిస్తున్నారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో, అటవీ ప్రాంతాల్లో లక్షలాది మందికి ఏసుక్రీస్తు సువార్తను అందించిన బోధకుడిగా గుర్తింపు పొందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతి పట్ల డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. పీవీఎల్ దూర ప్రాంతంలో ఉండటంతో ఫోన్ ద్వారా పాస్టర్ కుటుంబీకులను పరామర్శించారు. భీమవరం, ఉండి పాస్టర్స్ యూనియన్ ప్రతినిధులు, వ్యాపారులు, దైవ సేవకులు ఆయన భౌతిక ఖాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రాములోరికి వెండి కిరీటం సమర్పణ


సంతపేటలోని కోదండరామాలయంలో వెండి కిరీటాన్ని రాములోరికి అలంకరిస్తున్న అర్చకులు

ఆకివీడు: స్థానిక సంతపేటలోని కోదండ రామాలయంలో రాములోరికి, సీత, లక్ష్మణ, ఆంజనేయ స్వామి వార్లకు వెండి కిరీటాన్ని ఆదివారం అలంకరించారు. స్థానికులు మంగిన కృష్ణ కుమారులు వీర వెంకటరావు వాణీ విజయ దంపతులు, సీతారామ ప్రభ ఆదిలక్ష్మీ దంపతులు రూ. లక్ష విలువైన నాలుగు వెండి కిరీటాలను ఆలయ చైర్మన్ కోమటి రాంబాబుకు అందజేశారు. తొలత మేళ తాళాలతో వెండి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామి వార్లకు అలంకరించారు. ఈ కార్యక్రమంలో దాతలు, స్థానికులు డీవీ.రమణ మూర్తి, సన్నిధి వెంకన్నబాబు, వాడపల్లి మోహన్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు


ఉరదాళ్లపాలెంలో ప్రజలకు సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత కల్గిన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆదివారం అత్తిలి మండలం ఉరదాళ్లపాలెం, వరిఘేడు గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు సంబంధించి వేల కోట్ల రూపాయలు బటన్ నొక్కి మీ ఖాతాకే జమ చేస్తున్నారని, ఇటువంటి సంక్షేమ పాలన కొనసాగాలంటే తిరిగి మరలా వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు. కుల, మత పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేయడంతో ఇతర పార్టీల వారు సైతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పట్ల కృతజ్ఞతాభావంతో ఉన్నారని చెప్పారు. పుట్టబోయే బిడ్డ నుంచి పండు ముసలి వరకు సీఎం జగన్ ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందుతున్నారన్నారు. ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు ఇటీవల జగనన్న ఆరోగ్యసురక్ష వంటి బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేయించి, మందులను అందజేశారన్నారు. ఉరదాళ్లపాలెం గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో కోటిన్నర మాత్రమే సంక్షేమ, అభివృద్ధి పనులకు ఖర్చు చేసారని, మన ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ. 14.10 కోట్లు ఖర్చు చేశామని మంత్రి కారుమూరి వెల్లడించారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షల నిధులు విడుదల చేస్తే, ప్రతిపక్ష పార్టీలు కోర్టులో కేసు వేసి రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకున్నారని దుయ్యబట్టారు. అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్య నారాయణ, జెడ్పీటీసీ అడ్డాల జానకి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీ కో ఆప్షన్ మెంబర్ మహ్మద్ ఆబీబుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెలగల అమ్మిరెడ్డి, పార్టీ తణుకు టౌన్, మండల అధ్యక్షుడు మంగెన సూర్య, బోడపాటి వీర్రాజు పాల్గొన్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం


సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ప్రత్యేక పుష్పాలంకరణలో సత్యనారాయణ స్వామి

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని దిరుసుమర్రులో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రత పూజలు నిర్వహించారు. అర్చకులు లతాల మల్లేశ్వర శాస్త్రి ఆధ్వర్యంలో 50 మంది దంపతులతో కలశ, విఘ్నేశ్వర, పసుపు, కుంకుమలతో పూజలు నిర్వహించారు. సత్యనారాయణ స్వామి మహత్స్యం కథలను భక్తులకు వినిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, విజయ భాస్కరరావు, జక్కంశెట్టి శ్రీను, వేండ్ర పాటేశ్వరరావు, కేతా రమేష్ పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలి

మొగల్తూరు: కేంద్ర మాజీ మంత్రి యూవీ కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకొని యూవీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న మొగల్తూరులో నిర్వహించే మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని భీమవరం ఇంపీరియల్ ఆసుపత్రి వైద్యులు నరేష్ రాయసం కోరారు. ఆదివారం మొగల్తూరులోని అభ్యాస్ కళాశాల ఆవరణలో నిర్వహించిన పీఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. యుకె ఇండియా డయాబెటిక్ ఫుట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెబల్ స్టార్ యూవీ కృష్ణంరాజు మెమోరియల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా షుగర్ వ్యాధి చికిత్సా శిబిరాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో ఇంగ్లాండ్‌కు చెందిన వైద్య నిపుణులతో పాటు హైదరాబాద్, ఒంగోలు, విజయవాడ, భీమవరానికి చెందిన ప్రముఖ వైద్యులు పాల్గొంటున్నారన్నారు. ఈ శిబిరంలో షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడంతో పాటు ఉచితంగా మందులు అందిస్తారన్నారు. కార్యక్రమంలో మండల పీఎంపీల అధ్యక్షుడు ముక్తేశ్వరరావు, దాసరి బాబు, వర్మ ఆసుపత్రి పీఆర్ఓ. డాక్టర్ రవిశంకర్ రెడ్డి, చింతపల్లి రవికుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సందడి


మార్టేరు వేణుగోపాల ఉన్నత పాఠశాల 1983-84 బ్యాచ్ విద్యార్థులు

పెనుమంట్ర: మార్టేరు శ్రీవేణుగోపాల ఉన్నతపాఠశాల 1983-84 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం 40 వసంతాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి బ్యాచ్‌కు చెందిన 90 మంది విద్యార్థులు కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో అప్పటి గురువులు సత్తి భాస్కరరెడ్డి, గోపాలకృష్ణ రామచంద్రారావు, చదువుల సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, సాయి, టీవీ ఆచార్యులు, ప్రసాద్, రామకృష్ణంరాజు తదితరులను సత్కరించారు. కార్యక్రమంలో మేడపాటి శ్రీనివాసరెడ్డి, రావుల వెంకటేశ్వరరావు, కోనాల నాగమోహన్‌రెడ్డి, కోదండరామిరెడ్డి, ద్వారంపూడి వీర్రెడ్డి, రమేష్‌రెడ్డి, చర్ల జనార్ధన్ పాల్గొన్నారు.

ఘనంగా వాకర్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేసిన నూతన కార్యవర్గం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాకర్స్ భవనంలో ఆదివారం ఉదయం ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఘనంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా దూలం నాగరాజు, కార్యదర్శిగా చిప్పడ గురుమూర్తి, కోశాధికారిగా మల్లారెడ్డి కృష్ణార్జునరావు, ఇతర సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. వ్యవస్థాపక అధ్యక్షులు కేవీ కృష్ణారావు, గౌరవాధ్యక్షులు డాక్టర తానేటి శ్రీనివాస్, పూర్వ అధ్యక్షులు కేవీ చలం, జిల్లా గవర్నర్ వై.సత్యనారాయణ, కేవీ అనిల్ కుమార్, ఆదినారాయణ, బాకా వెంకటేశ్వరరావు, మాకా శ్రీనివాసరావు, పి.కుమారస్వామి, వాకర్స్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మహిళా వాకర్స్ అధ్యక్షురాలిగా 8వ సారి వనచర్ల విజయలక్ష్మిని ఎంపిక చేశారు. కార్యదర్శిగా కుంట్ల కనకదుర్గ, కోశాధికారిగా సీహెచ్ ఇందిరాకుమారిలు ఎంపికయ్యారు.

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో స్పందన

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ కార్యాలయ వర్గాలు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను నరసాపురం ఆర్డీఓ ఎంఏ అంబరీష్ స్వీకరిస్తారని వివరించారు. డివిజన్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారని, ప్రజలు తమ దరఖాస్తులు అందించాలని కోరారు.

అంగన్‌వాడీలు విధులకు హాజరు కావాలి


ఆకివీడు: మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ అంగన్‌వాడీ వర్కర్లు ఈ నెల 8న విధులకు హాజరు కావాలని ఆకివీడు ప్రాజెక్టు అధికారిణి వాణీ విజయరత్నం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం విధించిన గడువులోపు విధులకు హాజరుకాకపోతే అనంతరం తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

అయోధ్య శ్రీరాముని అక్షింతల ఊరేగింపు


పెదగరువులో అయోధ్య శ్రీరాముని అక్షింతలతో గ్రామోత్సవం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని పెదగరువులో ఆదివారం కోదండ రామాలయంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు కలశాలతో అయోధ్య శ్రీరాముని స్పర్శించిన దివ్య అక్షింతలను మేళా తాళాలతోను, డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా నాయకులు శివాజీ రాజు, మాల్యాద్రి, జగపతి రావు పాల్గొన్నారు.

కేశవస్వామికి లక్ష చామంతుల పూజ


ప్రత్యేకాలంకరణలో కేశవస్వామి

యలమంచిలి: స్థానిక శ్రీదేవి భూదేవి సమేత కేశవస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు వాడపల్లి గోపాల కృష్ణామాచార్యులు (గోపి) బ్రహ్మత్వంలో నిర్వహిస్తునన ఈ పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిత్య పూజలో భాగంగా ఆదివారం సామూహిక లక్ష్మీ పూజ, కుంకుమ పూజ చేశారు. అనంతరం లక్ష చామంతులతో దేవేరులకు పూజ నిర్వహించారు. గత నెల 17న ప్రారంభమైన ధనుర్మాస పూజలు ఈ నెల 14న జరిగే గోదాదేవి కల్యాణంతో ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్ కౌరు రామ వెంకట సత్యనారాయణ, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు.